వృథాగా పోతున్న నీరు... పట్టించుకునే వారే లేరు

మూడు రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

విశాలాంధ్ర-గొలుగొండ : మండలంలో కొత్త మల్లంపేట ప్రధాన రహదారిపై వాటర్ పైపు రంధ్రం పడి మూడు రోజులుగా మంచినీరు వృథాగా పోతున్న పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా మంచినీళ్ల వృధా గా పోవడంతో గ్రామస్తులు మంచినీళ్ల కోసం ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రధాన రహదారిపై ఇలా నీరు పోతున్న పట్టించుకోకుండా అధికారి యంత్రాంగం నిమ్మక నీరుతున్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా పైపులు రంధ్రాలను కప్పి నీరు వృధా కాకుండా చేసి త్రాగునీటి కష్టాలను తీర్చాలని కొత్త మల్లంపేట గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా నాయకుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి అరెస్టు అన్యాయం

విశాలాంధ్ర-కే.కోటపాడు : నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ పనిచేస్తున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అరెస్టు తీరు సక్రమంగా లేదని, ప్రభుత్వం ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని మండల సిపిఐ కమిటీ హితవు పలికింది. సోమవారం కే కోటపాడులో ఏర్పాటుచేసిన మండల సిపిఐ కమిటీ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా పోలీసుల తీరును ఖండించింది. మండల సిపిఐ కార్యదర్శి గొర్లె దేవుడుబాబు మాట్లాడుతూ గతంలో జరిగిన ఎల్‌జి పాలిమర్స్ పేలుడు కేసులో బాధితుల తరపున నిలబడి అస్వస్థతకు గురైన వారిని మెరుగైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారని అన్నారు. ఆనాడు కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారన్న కారణంగా సత్యనారాయణ మూర్తి పై పోలీసులు కేసు నమోదు చేశారని అన్నారు. అది నేటికీ కూడా పెండింగ్ లో ఉందని అన్నారు. ఆ కేసు విషయమై పోలీసులు స్టేషన్ కు పిలిపించి అరెస్టు చేయడం దుర్మార్గమని అన్నారు. ఒక ప్రజా నాయకుడికి ఈ కేసులో కనీసం రీకాల్ పిటిషన్ వేసుకునే అవకాశం ఇవ్వకుండా సాధారణ నేరస్తులు మాదిరిగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. పోలీసుల తొందరపాటు చర్యలను ఖండిస్తు న్నామని అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు వేచలపు కాసుబాబు మాట్లా డుతూ ప్రజల పక్షాన పోరాడే నాయకులకు ఇటువంటి చర్యల వల్ల భయపడరని , నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులు అన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటుతున్న అక్రమ కేసులపై నోరు మెదపడం లేదని విమర్శించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డి అప్పలనాయుడు, పొంతపల్లి రామారావు, సీముసిరి సూర్యనారాయణ, రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర రూ.15 వేలు తక్షణమే ఇవ్వాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు

విశాలాంధ్ర-అనకాపల్లి : ఆటో అండ్ మోటార్ వెహికల్ డ్రైవర్స్ డిమాండ్స్ పరిష్కారం కోసం ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ధర్నాను ఉద్దేశించి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ కూటమి ఎన్నికలకు ముందు వాహన మిత్ర 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచిన వాహన మిత్ర ఊసే లేదన్నారు. రాత్రనకా పగలనకా ఆటో కార్మికులు కుటుంబాల కోసం కష్టపడుతుంటే ఖాకీలు కనికరం లేకుండా ప్రభుత్వాల ఖజానా నింపడం కోసం కర్కసంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అధిక పెనాల్టీలు వేసే జీవో నెంబర్ 21, 31ను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. వాహన్ మిత్ర 15 వేల రూపాయలు చెల్లించి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరోపించుకోవాలని అన్నారు. వాహన మిత్ర కోసం బడ్జెట్ లో ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం సిగ్గు చేటు అన్నారు. ప్రమాదాల నివారణ పేరుతో తీసుకొచ్చిన 2023 నూతన మోటర్ యాక్టు చట్టం 106(1)(2) రద్దు చేయాలని దొరబాబు డిమాండ్ చేసారు. టాటా మ్యాజిక్ వ్యానులు కార్లు జీపులపై భారీగా పెంచిన రోడ్డు టాక్స్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్, టోల్గేట్ ఫీజులను 30 శాతానికి తగ్గించాలని, డ్రైవర్ పిల్లలకు విద్యా కానుక వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ అండ్ మోటార్ వెహికల్ డ్రైవర్స్‌కి పిఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వారధి గోవిందు, పెదరెడ్ల నాగేశ్వరరావు, వియ్యపురాజు, త్రినాథ్, కే. ఈశ్వరరావు, మహేష్, రామ్మోహన్, కే.శ్రీను, కోరి బిల్లి శంకర్రావు వీరు యాదవ్, నరాల శెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి జి ఏసుదాసు డిమాండ్

విశాలాంధ్ర -అనకాపల్లి : రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని లేకుంటే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించ వలసి వస్తుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నర్సీపట్నం, ఎలమంచిలి తదితర మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో సోమవారం ధర్నా నిర్వహిస్తూ ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి చిన్నచిన్న రాజకీయ కాంట్రాక్టర్లకు అప్పగించి కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా వెట్టిచాకిరి చేయించడంతోపాటు, కక్ష సాధింపు చర్యలకు పూనుకోబోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలీచాలని జీతాలతో అర్ధాకలితో జీవిస్తున్న ఈ కార్మికుల కు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, కార్మికుల నుండి వసూలు చేసినపిఎఫ్, ఈఎస్ఐ లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వ ఉద్యోగులబవలే వీరి కూడా 62 సంవత్సరాలు ఉద్యోగ విరమణ సదుపాయం కల్పించాలని కోరారు. మరణించిన కార్మికుల కుటుంబాలలో నుండి ఒకరికి ఉద్యోగ అవకాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆప్కాసును రద్దు చేయవలసి వస్తే, ప్రభుత్వమే మెరుగైన పద్ధతిలో వారికి ఆప్కాస్ కన్నా మెరుగైన జీతభత్యాలు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే కార్మికుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈనెల 11న రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా జరిగే మహాధర్నాలో అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వేమగిరి రాజు, కుమార్, టి శ్రీను, ఈ చంద్రావు, ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'వెలుగు'లో భారీ అక్రమాలు!

- డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా చేసిన వి బి కే
-సభ్యులకు తెలియకుండానే బ్యాంకు నుండి సుమారు రూ.4 లక్షలు విత్ డ్రా
- సభ్యుల ఫిర్యాదుతో దిగివచ్చిన వెలుగు బ్యాంకు సిబ్బంది

విశాలాంధ్ర- కోటవురట్ల: డ్వాక్రా సంఘాల సభ్యులు నెలనెలా బ్యాంకుకు జమ చేస్తున్న పొదుపు, అప్పు వారికి తెలియకుండా వి బి కే కాజేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన రుణాలు పొదుపు మొత్తం సుమారు రూ 4 లక్షల స్వాహా జరిగినట్లు గ్రూపు సభ్యులు గుర్తించారు. సభ్యులంతా నిరుపేదలైన గిరిజనులు కావడంతో, అక్షర జ్ఞానం లేకపోవడంతో ఇదే అవకాశంగా భావించి స్థానిక విబికే బొండపల్లి వేణమ్మ బ్యాంకు అధికారులను మచ్చిక చేసుకుని రూ.4 లక్షల సొమ్మును విత్ డ్రా చేయడం స్థానికంగా కలకలం రేపింది. జరిగిన సంఘటనపై డ్వాక్రా మహిళలంతా సమావేశమై గ్రామ పెద్దలు దృష్టికి తీసుకువెళ్లగా వారంతా స్థానికంగా సోమవారం సమావేశమై వెలుగు బ్యాంకు అధికారులను తమ వద్దకు రప్పించుకొని జరిగిన అన్యాయంపై నిలదీశారు. డ్వాక్రా సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో కైలాసపట్నం శివారు రాజగోపాలపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళలు భవాని, అక్షయ, వేణు డ్వాక్రా గ్రూపులో సభ్యులుగా ఉన్నారు. వారంతా ప్రతి నెల నెల పొదుపులు వసూలు చేసి బ్యాంకుకు జమ చేస్తున్నారు. బ్యాంక్ అధికారులు భవాని అక్షయ వేణు గ్రూపులకు రుణాలు మంజూరు చేశారు. భవాని గ్రూపు సభ్యులకు సుమారు రూ7 లక్షల 50 వేలు మంజూరు కాగా, రూ 5లక్షల మాత్రమే సభ్యులకు పంపిణీ చేసి, మిగిలిన రూ2 లక్షల 50 వేలు సభ్యులకు తెలియకుండా వి బి కే వేణమ్మ స్వాహా చేసినట్లు గుర్తించారు. అలాగే అక్షయ డ్వాక్రా గ్రూపు నుండి రూ 47,000, వేణు గ్రూప్ నుండి రూ1 లక్ష సభ్యులకు తెలియకుండా బ్యాంక్ అధికారుల సహకారంతో వేనమ్మ స్వాహా చేసినట్లు సభ్యులు ఆరోపించారు. దీనిపై గ్రామ పెద్దలు సమక్షంలో డ్వాక్రా గ్రూపు మహిళలు తో బ్యాంక్ అధికారులు వెలుగు సిబ్బంది సోమవారం సమావేశమై జరిగిన సంఘటనపై చర్చించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ గంగు నాయుడు వెలుగు సిబ్బంది సభ్యుల సమక్షంలో వి బి క వేనమను నిలదీశారు. వేణమ్మపై శాఖపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయించి సభ్యులకు ఎటువంటి నష్టం లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం కారణంగానే విబికే వేనమ్మ సుమారు రూ 4 లక్షలు స్వాహా చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోని పేదల సొమ్ముకు భద్రత భరోసా కల్పించాలని కోరారు.

వాహనదారులపై అధిక జరిమానాలు!

- ఇదేనా కూటమి ప్రభుత్వం సంపద సృష్టి
- ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయండి
- వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర-మునగపాక: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ట్రాఫిక్ రూల్స్ పేరిట వాహనదారులకు భారీ జరిమానాలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమని, దీంతో సామాన్య ప్రజల సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మునగపాక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంలో తప్పులేదని, అయితే వాహనదారులకు జరిమానా భారీ స్థాయిలో విధించడం సమంజసం కాదన్నారు. ప్రధానంగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000, అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే రూ.10వేలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు, ఇన్సూరెన్స్ లేకపోతే తొలిసారిగా రూ.2,000, రెండోసారి దొరికితే రూ.4000 జరిమానా విధించడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఎన్నికల్లో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోగా, ప్రజలపై తీవ్రమైన భారం మోపుతున్నారన్నారు. సంపద సృష్టించడం అంటే ఇదేనా అంటూ ప్రశ్నించారు. సుదీర్ఘ నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు పేద బడుగు బలహీన వర్గాల వారిపై ఈ విధంగా పన్నుల భారం వేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమేన సంపద సృష్టించడం అంటే, అని కూటమి ప్రభుత్వాన్ని ప్రసాద్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అరుబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు పాల్గొన్నారు.

చిన్నగుమ్ములూరులో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర -యస్.రాయవరం : మండలంలో చిన్నగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా యలమంచిలి అటవీ రేంజ్ పాయకరావుపేట సెక్షన్ ఆధ్వర్యంలో విద్యార్థులు పోటీ పరీక్ష రాశారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు పి.సత్తిబాబు, అటవీ శాఖ అధికారులు ఎల్.విజయ్ కుమార్, ఎం.కృష్ణ, పిఈటి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 3,33,333 విరాళం

విశాలాంధ్ర-పాయకరావుపేట : మండలంలోని కుమారపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కుమార ఉమా రామలింగేశ్వర స్వామి శివాలయం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన నీలాపు వేణు వెంకట కృష్ణారెడ్డి ఆయన పుట్టినరోజు సందర్భంగా రూ. 3,33,333లు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ నిర్వహకులు, గ్రామ పెద్దల సమక్షంలో విరాళం సొమ్మును చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు వేణు వెంకట కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈనెల 30వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం

విశాలాంధ్ర-చీడికాడ : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఈ నెల 1 నుండి 30 వరకు పశువులలో గాలి కుంటువ్యాధి నిరోధక టీకాల కార్యక్రమము నిర్వాహిస్తున్నామని పెదగొగాడ పశువైద్యాధికారిణి కే వి యస్ రాఘవమ్మా అన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలం లోని పెదగొగడ శిరిజాం జైతవరం బైలపూడి గ్రామాలలో సుమారు 450 పశువులకు గాలి కుంటు 120 ఆడ పెయ్యలకు బ్రుసెల్లా టీకాలు సిబ్బందితో కలసి వేశమన్నారు 4నెలలు దాటిన ప్రతి పశు వులలో గాలి కుంటువ్యాధి టీకాలు తప్పనిసరిగా రైతులు తమ పశువులకు వేయించాలని సూచించారు గాలి కుంటు వ్యాధి పశువులకు సోకితే పశువులకు తీవ్రమైన జ్వరం నీరసం నోటి నుండి తీగల మాదిరి చొంగలు నోరు మరియు గిట్టల మధ్య పుండ్లు చూడి పశువులలో ఇసుకుపోవడం జరుగుతాదని అన్నారు దేనివలన పాల దిగుబడి తగ్గుతుందని ఆమె తెలిపారు ఆడపెయ్యలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధిక టీకాలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమన్ని రైతులు జయప్రదం చేయాలని కోరారు ఈ కార్య క్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తానాంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర -పరవాడ : పరదేశిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని పరవాడ మండలం తానాంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఫార్మాసిటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను మాజీ జడ్పీటీసీ పైల జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ సారి అమ్మవారి పండగ సందర్భంగా క్రికెట్ పోటీలను ఘనంగా నిర్వహించడం జగురుగుతుంద న్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.18వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. మొదటి పోటీలో దోసూరు, తానాం జట్లు తలపడగా వీరు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్రి వసంతరావు, వర్రి వెంకటరమణ, సతీష్, పైల అప్పారావు, రొంగలి అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పైల కృష్ణారావు, పైల జానకీరామ్, కన్నూరు యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీడీ పిక్కలకు రూ.200 మద్దతు ధర ఇవ్వాలి

విశాలాంధ్ర-వి.మాడుగుల... జీడిపిక్కలకు రూ.200 మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మాడుగుల మండలం అవురవాడ పంచాయతీ కొండవీధి గ్రామంలో జీడిరైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు కె.భవాని మాట్లాడుతూ జీడీ పంటకు మద్దతు ధర కోసం ఈరోజు అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. పంటలు నష్ట పోయిన రైతులకు నష్టం పరిహారం చెల్లించాలని, జీడికి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్టు బడులు కోసం రుణాలు మంజూరు చేసి ఈక్రాఫ్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దళారీల చేతిలో దోపిడీకి గురై తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సంవత్సరం వాణిజ్య పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తుంటాయని, కానీ జీడి పంటకు మాత్రం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. దీనిపై ఈరోజు అసెంబ్లీలో చర్చించి జీడికి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సోలం పెద్ద అప్పారావు, కొప్పల తలుపులురాజు, గదబరి కొండమ్మ, గదబరి పూజ, సోలం రాజులమ్మ, సోలం ఈశ్వరమ్మ, సోలం రాజబాబుతో పాటు అదిక సంఖ్యలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శన

విశాలాంధ్ర-యలమంచిలి : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లక్కబొమ్మల తయారీలో కొత్త డిజైన్లు రూపొందించాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం సందర్శించారు. లక్కబొమ్మల తయారీని పరిశీలించి, హస్త కళాకారులతో జిల్లా కలెక్టరు మాట్లాడడం జరిగిందని అన్నారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ లక్కబొమ్మల తయారీ విధానం, వాడే ముడిపదార్థాలు, ఉపయోగించే రంగులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడుగగా బొమ్మల తయారీకి అవసరమైన అంకుడు కర్ర అవసరం మేరకు లభ్యం కావడంలేదని తెలిపారు. సాగును పెంచి, ఫారెస్ట్ డిపార్టుమెంటు ద్వారా డిపో ఏర్పాటు చేసి అందించాలని, వారి వ్యాపారాభివృద్ధికి ఋణసదుపాయం, నైపుణ్య శిక్షణ అందించాలని కళాకారులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశరాజధాని డిల్లీలో జరిగిన పరేడ్ లో జిల్లాకు చెందిన లక్కబొమ్మల థీమ్ తో కూడిన శకటం ప్రదర్శించబడటం, మూడవ స్థానంలో విజేతగా నిలవడం జిల్లాకు దక్కిన గౌరవమని అన్నారు. అదేవిధంగా రాష్ట్రపతి భవన్ లో లక్కబొమ్మల స్టాల్ ఏర్పాటు చేయనుండడం గర్వకారణమని తెలిపారు. లక్కబొమ్మల ఉపాధి రంగాన్ని పోత్సహించేందుకు, అంతర్జాతీయంగా పోటీని ఎదుర్కొనేలా కొత్త డిజైన్స్ రూపకల్పనకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. హస్తకళానైపుణ్యం ద్వారా లక్కబొమ్మల తయారీ రంగానికి, జిల్లాకు మంచి పేరు తెస్తున్న కళాకారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి కె.శచీదేవి, తహశీల్దారు వరహాలు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

పిపి అగ్రహారంలో పడకేసిన పారిశుధ్యం శీర్షికపై పంచాయతీ అధికారుల స్పందన

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలంలోని పి పి అగ్రహారం గ్రామంలో పారిశుధ్య నిర్వహణ లోపం అనే కథనం విశాలాంధ్ర పత్రికలో వచ్చిన శీర్షిక పట్ల బీపీ అగ్రహారం గ్రామ పంచాయతీ అధికారులు, క్లాప్ సిబ్బంది స్పందించి త్రాగునీటి బోరు పరిసరాలను, రోడ్డుకు ఇరువైపున ఉన్న మురుగు కాలువలను క్లాప్ సిబ్బంది చేత శుభ్రపరిచి శానిటేషన్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణి తెలిపారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-నక్కపల్లి : రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం నక్కపల్లి మండలం గొడిచెర్ల ప్రాథమిక సహకార సొసైటీ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. గొడిచెర్ల గ్రామంలో 980 ఎకరాలలో వరి పంట వేసినందుకు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. ఈ భూమిలో మొత్తంలో 29 వేల మెట్రిక్ టన్నులు వరకు ధాన్యం పండింది. దీంట్లో జనవరి నెలలో కేవలం 689.90 మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేశారు, అయితే ఇప్పుడు అపరాలు పంట తీసి వరి పంట నూర్పిడులు చేస్తున్న ఈ సందర్భంగా రైతులు దగ్గర ధాన్యం కొనుగోలు చేయమని కోరుతుంటే మా టార్గెట్ అయిపోయింది అందువలన కొనుగోలు చేయలేమని అధికారులు సమాధానం చెబుతున్నారు దీని కారణంగా రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారుప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయని కారణంగా అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు ఎలా అయినా అప్పులు తీర్చాలని ప్రైవేటు మిల్లర్లు కు అమ్ముతూ ప్రైవేటు మిల్లర్లు దోపిడీకి గురౌతున్నారని తెలిపారు. వెంటనే సివిల్ సప్లై డిపార్ట్మెంట్, వ్యవసాయ శాఖ, కోపరేట్ బ్యాంకు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో రైతులు దగ్గర ధాన్యం కొనుగోలు చేయాలని లేనిపక్షంలో ఆందోళన బాట తప్పదని తెలిపారు. రైతులు చేస్తున్న పోరాటానికి వైయస్సార్ సిపి నాయకులు వీసం రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఏ.రమణ, వి.వెంకటశివ, ఎన్.రామకృష్ణ, ఎన్.వెంకట సుబ్బారావు, వి.సుబ్బారావు, జీ.రామారావు, జీ.సత్యనారాయణ, వి.అమ్మిరాజు, జీ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజి సమస్యను తీర్చాలి

విద్యుత్ అధికారులు తీరు మార్చుకోవాలి : సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం చ0ధక వీధి ప్రాంతాలలో విద్యుత్ లో వోల్టేజి సమస్యను తీర్చాలని, అధికారుల తీరు మార్చుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో చందక వీధి ప్రాంత నివాసితులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిపిఐ నేత రెడ్డిపల్లి మీడియాతో మాట్లాడుతూ నిరంతరం లోవోల్టేజి సమస్యతో ఇక్కడ నివసిస్తున్న మహిళలు వృద్ధులు చిన్నపిల్లలు విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అసలే పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కరెంట్ వోల్టేజ్‌వల్ల చదువుకోవడానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. గతంలో పలుమార్లు లో వోల్టేజి సమస్యపై విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకు వెళ్ళినను ప్రజా సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడు అన్నారు. చందక వీధిలో నివసించే మహిళలు ప్రజలు విద్యార్థులతో విద్యుత్ అధికారులు మొండి వైఖరికి నిరసనగా ఆందోళనకు దిగినట్లు తెలిపారు. తక్షణమే విద్యుత్ ఉన్నతాధికారులు చందక వీధిలో గల విద్యుత్ ట్రాన్సార్మర్లు మార్చి లోవోల్టేజ్ సమస్యని తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోరా కృష్ణ, జోగ గణేష్, చందక సంతోష్ కుమారి, వారాధి వరలక్ష్మి, నండ లచ్చమ్మ, చందక చిలకమ్మా, మరియు నివాసితులు ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పురోగతిపై ఎస్పీ ఆరా

విశాలాంధ్ర-అనకాపల్లి : టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఎస్పీ తుహిన్ సిన్హా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రాపర్టీ రూమును తనిఖీ చేసి, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. గంజాయి సేవించే వారి సమాచారాన్ని సేకరించి, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. సీసీటీవీ కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేసి ట్రాఫిక్ రద్దీని వీక్షించి అధికారులకు సూచనలు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై గట్టిగా చర్యలు తీసుకోవాలని, ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు మరియు చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులను కౌన్సిలింగ్ చేయడంతో పాటు, వారి ప్రస్తుత నడవడికపై నిఘా పెట్టాలని తెలిపారు. దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు రాత్రి, పగలు గస్తీలను మరింత పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, టౌన్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ టీ.వి.విజయకుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐలు ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం కోసం ప్రియుడి ఇంటి ముందు దీక్ష

ఓ మృగాడు చేతిలో మోసపోయిన మహిళ
న్యాయం జరిగే వరకు బాధితురాలికి అండగా సి.పి.ఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి

విశాలాంధ్ర-చోడవరం : మండలంలోని గాంధీ గ్రామం పంచాయతీలో ఓమృగాడు కొమ్మోజు సతీష్ చేష్టలతో మోసపోయి, ఓ బిడ్డకు జన్మనిచ్చిన మొల్లి నూకరత్నం అనే మహిళ న్యాయం కోసం ప్రియుడు ఇంటి ముందు మౌన దీక్షకు దిగింది. వివరాల్లోకి వెళితే భర్తతో విభేదాలు కారణంగా విడిపోయిన ఒంటరి మహిళ నూకరత్నం కుటుంబ పోషణకు ఓ వస్త్ర దుకాణంలో పనిచేసేది. అదే వస్త్ర దుకాణానికి ఎదురుగా పనిచేసే బైకు మెకానిక్ కొమ్మోజు సతీష్ మహిళను నమ్మించి మూడేళ్ల క్రితం తాళి కట్టి గర్భవతిని చేసాడు. తీరా ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చాక ముఖం చాటేసాడు. దీంతో చేసేదేమీ లేక ఆమె ప్రియుడి ఇంటి ముందు న్యాయం కోసం మౌన దీక్షకు దిగింది. దీనిపై భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు బాధితురాలికి న్యాయం జరిగే వరకూ ఆమె తరుపున పోరాటం చేస్తామని మీడియాకు తెలియజేశారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-చోడవరం : అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు ఈనెల ఒకటి నుండి 8 వరకు నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని చోడవరం ఎస్సై జోగారావు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఉషోదయ డిగ్రీ కాలేజ్ విద్యార్థినిలకు "లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం మరియు పితృస్వామిక నిబంధనలు సవాల్ చేయడంలో పురుషులు పాల్గొనడం అవసరం" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు మరియు చోడవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితా ప్రచురణ

అభ్యంతరాలు స్వీకరణకు ఆహ్వానం

విశాలాంధ్ర-బ్యూరో అనకాపల్లి : జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు & మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ఆధారంగా రూపొందించాం. ఈ జాబితాలు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డులలో అందుబాటులో ఉంటుందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వెబ్సైట్‌లో ఉంటుందని తెలిపారు. https:// sites.google.com/ site/deovizag2 అభ్యంతరాల స్వీకరణ కొరకు సీనియారిటీ జాబితాపై ఎవరైనా అభ్యంతరాలు కలిగి ఉంటే ఈనెల పదో తేదీలోపు వాటిని సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి, విశాఖపట్నం కార్యాలయం నకు 03.00 నుండి 07.00 వరకు సంప్రదించవచ్చని తెలిపారు. అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు,సీనియారిటీ జాబితా లో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలి, ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు (ఉండినట్లయితే) జత చెయ్యాలని తెలిపారు. గడువు తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబడపని, ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకొని సంబంధిత ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయులకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఎస్సైలు పి రామారావు, వై తారకేశ్వరరావు

విశాలాంధ్ర -గొలుగొండ: మహిళా దినోత్సవం సందర్భంగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మండలంలో జోగంపేట ఏ ఎల్ పురం ప్రభుత్వ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని గొలుగొండ ఎస్సై పి రామారావు కృష్ణదేవిపేట ఎస్సై వై తారకేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈ వ్యాచరచన పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు . అదేవిధంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే సమాజం కూడా అభివృద్ధి బాటలో పయనిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే చదువును కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. అలాగే చదువుపై మక్కువ సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకొని విద్యార్థులుచదివిన పాఠశాలకు పుట్టి పెరిగిన ప్రాంతానికి తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జోగంపేట ప్రధానోపాధ్యాయురాలు సరోజిని ఏఎల్‌పురం ప్రధానోపాధ్యాయులు నాగభూషణం ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు నియంత్రించాలి

ఐసీడీఎస్ సూపర్వైజర్ మీరాభి

విశాలాంధ్ర-మునగపాక : ప్రతి గ్రామంలో బాల్యవివాహాలను నియంత్రించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ మీరాభి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సోమవారం తోటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. బాల్య వివాహాలపట్ల అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.ఎస్ సోమయాజులు మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు తమ అద్భుత తెలివి ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎం రమణి,ఆశా కార్యకర్తలు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె గెలుపు

జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోజంకి హర్షం

విశాలాంధ్ర-వేపాడ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వెలమ ముద్దు బిడ్డ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు ఘనవిజయం సాధించడం హర్షనీయమని జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, చినగుడిపాల గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు అన్నారు. గాదె గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన ఉపాధ్యాయ సోదరులందరికి వెలమ సంక్షేమ సంఘం ద్వారా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. టీడీపీ బలపర్చిన అభ్యర్థి ఓటమి పాలు కావడం కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు అద్దం పడుతుందన్నారు. రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు లగుడు గోవిందరావు ఆశీస్సులతో రాష్ట్రంలో గల వెలమ కుటుంబ సభ్యులందరి తరుపున ఎమ్మెల్సీ గాదెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నామని జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోజంకి రామునాయుడు చెప్పారు.

వంగరలోప్రకృతి వ్యవసాయ కూరగాయలు విక్రయాలు

విశాలాంధ్ర-వంగర : మండల కేంద్రం వంగరలో ప్రకృతి వ్యవసాయ కూరగాయలు విక్రయాలు జరిగాయి. సోమవారం మండల కేంద్రం వంగర ఎంపిడిఓ కార్యాలయ అవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కూరగాయలను మండలంలో మరువాడ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి ఆర్నేపల్లి సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఎరువులు వేయకుండా మరువాడ, కింజంగి తదితర గ్రామాల రైతులు ద్వారా సాగు చేసి పండించిన కూరగాయలను వంగర తీసుకు వచ్చి న అమ్మకాలు చేపట్టారు.కూరలను పలు గ్రామాల నుంచివచ్చినపలువురుతీసుకున్నారు. ఎలాంటి ఎరువులు పురుగు మందులు ఉపయోగించకుండా పండించిన ఈ కూరగాయలు తోటకూర, జనపకూర, సొత్తి దుంపలు, అనబకాయలు, తదితర అనేక రకాల కూరలతో సహా ముద్దపప్పు విక్రయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీ ఆర్ పి వేమిరెడ్డి పోలినాయుడు తదితరులు ఈ విక్రయాల్లో పాల్గొన్నారు.

జేఎన్‌టియులో ప్రతిష్ట 2కె25 సాంకేతికోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జేఎన్‌టియు జివి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రతిష్ట 2కె25 సాంకేతికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు తాజా సాంకేతికతపై అవగాహన పెంచడానికి, పరిశ్రమ నిపుణులతో మమేకం కావడానికి, నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఈ వేడుకకు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఇండియన్ రైల్వే. డా.సాయిబాబా అంకల హాజరయారు. అలాగే, , ప్రొఫెసర్ పి ఉదయ్ భాస్కర్ ఫార్మర్ ఏ పి పి ఎస్ సి చైర్మన్, జేఎన్టీయూ జీవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ .రాజేశ్వరరావు, డా.జి.అప్పాలనాయుడు, చైర్‌పర్సన్గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న లా వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ డి. సూర్యప్రకాశరావు

నిరుపేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-సబ్బవరం : మండలంలోని గోటివాడ గ్రామంలో దామోదర సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ దరి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి 10 వ వార్షికోత్సవం పురస్కరించుకొని తీర్థ మహోత్సవం వడిసెల లక్ష్మణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 5 గంటల నుండి స్వామికి తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ వార్షికోత్స, తీర్థ మహోత్సవానికి లా వర్సిటీ ఉపకొలపతి ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వడిసెల లక్ష్మణ బ్రదర్స్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్వామిని దర్శించుకున్నారు. ఈ వార్షికోత్సవం పురస్కరించుకొని వడిసెల లక్ష్మణ సొంత నిధులతో సమకూర్చిన నిత్యవసర సరుకులను ఉపకులపతి ప్రొ డి.సూర్యప్రకాశరావు చేతుల మీదుగా 20 మంది నిరుపేదలకు పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు . భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు సీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా, నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు: వడిసెల లక్ష్మణ చేతుల మీదగా నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యకమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ బొండా సత్యారావు, మాజీ సర్పంచ్ వడిసెల రమేష్, నీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు ,ఆలయం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, వడిసెల బ్రదర్స్, యూత్ నిర్వాహకులు గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 5న గుడ్ షెపర్డ్ స్కూల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర-అనకాపల్లి : ఈనెల 5న గుడ్ షెపర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 47వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ ఏ.ధర్మదాస్ తెలిపారు. స్కూల్ ఆవరణంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడ్ షెపర్డ్ఇంగ్లీషు మీడియం స్కూలుని 1978 తన తండ్రి వినయానంద్ స్థాపించారని స్థాపించిన నాటి నుండి విద్యార్థులు అందరికి ఉన్నతవిద్యను అందించడం ఈ పాఠశాల ముఖ్య ఉద్దేశంగా కొనసాగుతుందని తెలిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు అందరు ఉన్నతమైన స్థాయిలో స్థిరపడటానికి పునాదిగా నిలిచిందన్నారు. పట్టణములో ఐసియస్ సి కరిక్యులమేను మొట్టమొదటిగా పరిచయం చేసి, ఉన్నతమైన ప్రమాణాలతో కూడిన విద్యను అదేరాతిలో కొనసాగిస్తున్న ఘనత మన గుడ్ షెపర్డ్ స్కూల్ కె దక్కుతుందన్నారు. బ్రిటిష్ కౌన్సిలే వారి నుంచి ఇంటర్నేషనల్ స్కూలు ఆవార్డు పొందిన గొప్పతనం పాఠశాలకి దక్కింది. మా పదవ తరగతి విద్యార్థులు ప్రతి సంవత్సరం నూటికి నూరుశాతం మార్కులు సాధిస్తూ మా స్కూలులో చదివిన అందరు అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడగలరని తెలిపారు. పూర్వ విద్యార్థి విశ్వ తేజ ఐఐటి ముంబాయిలో విద్యను అభ్యసిస్తూ, తన మిత్రబృందంతో కలిసి చేసిన ప్రాజెక్టికి గాను ప్రధానమంత్రి ప్రశంసించి, దానికిగాను ఆయన చేతుల మీదగా లక్ష రూపాయలను బహుమతిగా అందజేశారని తెలిపారు. గతసంవత్సరం జరిగిన పదవతరగతి పరిక్షలలో తెలుగు సబ్జెక్టులో నూటికి నూరుశాతం మార్కులు సాంధించిన నలుగురు విద్యార్థులకు ఐ సి ఎస్ ఈ కౌన్సిల్ వారి నుంచి మెరిటే సర్టిఫికెట్స్ లభించాయని తెలిపారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు 200లకు పైగా డాక్టర్లుగాను, 800 మందికి పైగా ఇంజనీర్లుగాను పద్దారని తెలిపారు. పాఠశాలకు ఎల్లప్పుడు దాడి వీరభద్రరావు ప్రత్యేక గౌరవ అతిధిగాం విచ్చేస్తారు. అదేవిధంగా ఈ సంవత్సరం కుండా దాడి వీరభద్రరావు తో పాటు, దాడి రత్నాకర్,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ డాక్టర్ ఇ.కరుణకుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం గుడ్ షెపర్డ్ స్కూల్ నిర్వహించిన వార్షికోత్సవంలో 30 నాటకం ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంటుందని ఈసంవత్సరం కూడా విజయనగర సామ్రాజ్య చక్రవర్తి 'శ్రీకృష్ణదేవరాయలు మహాయుక్తి తిమ్మరుసు మధ్య ఉన్న మైత్రి బంధం' నాటక రూపంలో విద్యార్థులు ఇచ్చే ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

మంచి నడవడికతో పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని, జిల్లాకు కేటాయించిన నలుగురు ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ను మార్చి 3న మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాన్ని అందజేసారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - మంచి నడవడికతో పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. జిల్లాకు రిపోర్టు చేసిన ఎస్ఐలు బి.సాయిరాం పడాల్, పి.నాని, కే.సాయిరాం, కే.దుర్గాప్రసాద్‌లతో జిల్లా ఎస్పీ మమేకమై, వారు ఏమి చదువుకున్నది, శిక్షణ ఏవిధంగా సాగినది, శిక్షణలో నేర్చుకున్న అంశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణలో ఎక్కువగా సాంకేతిక అంశాలు గురించి అవగాహన పొందినందున, సాంకేతికతను వినియోగించుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. ప్రజలు పోలీసు శాఖపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా, నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పని చేయాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని, విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, నిందితులు శిక్షింపబడే విధంగా కేసుల దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. కొద్ది రోజుల గ్రేహౌండ్స్ శిక్షణ పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించేందుకు, పోలీసు రికార్డులు, దర్యాప్తు మెళుకవులు తెలుసుకొనేందుకు వివిధ పోలీసు స్టేషనుల్లో నియమిస్తామని ప్రొబేషనరీ ఎస్ఐలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ దిశా నిర్దేశం చేసారు.

పాటూరు కళ్లాల్లో నేడు శ్రీ అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం

- **హోరాహోరీగా సాగనున్న ఎడ్ల పరుగు పందాలు**
- **అలరించునున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు**
- **పాల్గొన్న వేలాదిమంది భక్తులు**

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని పాటూరు గ్రామ సమీపంలోని గాడి వారి కళ్లాలు (క్వారీ వద్ద)శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి వారి 19వ తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది.తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల భక్తులు వేకువ జామునుండే పసుపు, కుంకాలతో ధూప,దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోగా వేద పండితులు బొడ్డపాటి హరి శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.తీర్థ మహోత్సవాన్ని పరిష్కరించుకొని జాకేరు వీరాంజనేయ భజన బృందం వారిచే భజనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి ఎడ్ల పరుగు పందెం ప్రదర్శన నిర్వహించబడునని కమిటీ వారు తెలిపారు.అలాగే సాయంత్రం 5గంటల నుంచి సిద్ధి వినాయక బుర్రకథ బృందం వారిచే బుర్రకథ ప్రదర్శన నిర్వహించనున్నారు.ఈ తీర్థ మహోత్సవాన్ని చుట్టూ పక్కల గ్రామాలు తిలకించి విజయవంతం చేయవలసిందిగా కమిటీ సభ్యులు కోరారు.

కినౌచీ ఏసీలను ఆవిష్కరించిన హైయర్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రధాన గృహోపకరణాల అంతర్జాతీయ బ్రాండ్‌గా నిలుస్తున్న హైయర్ అప్లయన్సెస్ ఇండియా హోమ్ కూలింగ్‌లో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పుతూ ప్రత్యేకమైన కలర్‌ఫుల్ శ్రేణి కినౌచీ ఎయిర్ కండిషనర్స్ ఆవిష్కరించింది. ఆధునిక గృహాలను మరింత చక్కగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రూపొందించిన ఈ ప్రీమియర్ సిరీస్ అద్భుతమైన పనితీరును అవంట్ గార్డ్ చక్కదనంతో నిరాటంకంగా సమ్మిళతమవుతుందని కినౌచీ ఎయిర్ కండిషనర్ సిరీస్ ఆవిష్కరణ సందర్భంగా హైయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్.ఎస్ సతీష్ తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీ, ప్రీమియం కలర్‌ఫుల్ ఫినిష్‌తో కూడిన కినౌచీ లిమిటెడ్ ఎడిషన్ ఎయిర్ కండిషనర్లు కేవలం చల్లదనాన్నే కాదు ఇంటి అందాన్ని పునర్‌నిర్వచిస్తాయన్నారు. భారతీయ వినియోగదారుల్లో డిజైన్‌పై పెరుగుతున్న అవగాహనతో వారు తమ జీవనశైలి, వ్యక్తిగత అభిరుచికి అనుగుణంగా ఉండే ఉపకరణాలు కోరుకుంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని హైయర్ ఇండియా ఈ ప్రత్యేక శ్రేణిని ప్రవేశపెట్టిందన్నారు.

ఖాదర్ బాబా దర్బార్‌లో రెండో రోజు పవిత్ర రంజాన్ మాస ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : హుజూర్ హజరత్ సూఫీ సెహన్షా బాబా ఖాదర్ అవులియా వారి దర్బార్ లో రంజాన్ మాస పర్వదినాన్ని పురస్కరించుకుని, ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిం సోదరులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు రెండో రోజు సోమవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఖాదర్ షా దర్గా దర్బార్ ముతవల్లి(ధర్మకర్త) మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ సాబిరీ(ఖలీల్ బాబు) ప్రేమతో ముస్లిం సోదరులతో పాటు బాబా ప్రేమికులనూ ఆహ్వానించి, వారికి పోషక విలువలతో కూడిన సంతృప్తికరమైన ఇఫ్తార్ విందును అందించారు. అధిక సంఖ్యలో ప్రజలు ఈ విందులో పాల్గొన్నారు. ప్రతీ ఏటా ఖాదర్ బాబా దర్బార్ లో ఇఫ్తార్ విందును నెల రోజులు పాటు నిర్వహించడం అత్యంత విశేషం, ప్రశంసనీయమని భక్తులు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు.

శ్రీ కాశీవిశాలాక్షి సహిత కాశీవిశ్వేశ్వర స్వామివారిని దర్శించుకున్న బొడ్డేడ

విశాలాంధ్ర-మునగపాక: మండల కేంద్రమైన మునగపాక గ్రామంలో మెయిన్ రోడ్డులో వెలసి ఉన్నటువంటి శ్రీ కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని అనకాపల్లి జిల్లా మాజీ వైసీపీ అధ్యక్షుడు,రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమంలో ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆడారికాశీబాబు, కోనపల్లి రామ్మోహన్ రావు,తిమ్మరాజుపేట గ్రామ ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, ఆలయ కమిటీ చైర్మన్ సూరిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, డా. అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి అని ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు పి. సుభాషిని, ఎన్.రామకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పి సుభాషిని మాట్లాడుతూ తమ కాలేజీ పరీక్షా కేంద్రంలో 308 మంది విద్యార్థులకు గాను 298 మంది హాజరైనట్లు తెలిపారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు తెలిపారు. అలాగే డాక్టర్ అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో 236 విద్యార్థులకు గాను 234 మంది విద్యార్థులు మొదట రోజు పరీక్షకు హాజరుకాగా 2 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు డాక్టర్ అంబేద్కర్ గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ తెలిపారు. రెండవ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు.

మల్లవరం వీఆర్ఏ రాజు మృతి

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో మల్లవరం వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న పలివెల రాజు (40) సోమవారం ఉదయం ఉద్యోగానికి బయలుదేరి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వెనక్కి పడిపోవడం వలన తలకు వెనుక భాగాన దెబ్బ తగలడంతో వెంటనే ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడని వైద్యులు తెలిపారు.రాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.సమాచారం తెలిసిన వెంటనే జిల్లా తెలుగు రైతు కార్యదర్శి మళ్ల వరహా సర్సింగరావు, మండల తహసిల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ వి.శేషుబాబు,వీఆర్వోలు బి.వి సత్యనారాయణ, వీరన్న, రమేష్, కోటి, వీఆర్ఏలు ఎల్.సన్యాసిరావు, ఎల్.శాంతి, చిన్న తదితరులు రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బెల్టు షాపుపై దాడి

12 మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర-రాంబిల్లి : మండలంలో పెదకలవలాపల్లి గ్రామంలో సోమవారం బెల్టు షాపుపై దాడి చేసినట్లు రాంబిల్లి ఎస్సై డి.నాగేంద్ర తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపుపై దాడి చేసి ఎమ్.నర్సింహరావు అనే వ్యక్తి వద్ద నుంచి రూ.1836లు విలువ చేసే 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం సీసాలు తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.